ప్రజాశక్తి
శనివారం 14 జూన్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి -నెల్లూరు : రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత అన్నారు. శుక్రవారం ఉదయం భారతీయ స్టేట్‌బ్యాంక్ 70వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా రెడ్‌క్రాస్ సౌజన్యంతో రంగనాయకులపేట భారతీయ స్టేట్‌బ్యాంకు రీజనల్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుజాత హాజరై రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మనం చేసే రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుందన్నారు. శారీరకంగా రక్తదానంతో అనేక ప్రయోజనాలు న్నాయన్నారు. ప్రతిఒక్కరూ కూడా రక్తదానంపై అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ పి మురళీనాయక్ మాట్లాడుతూ సమాజ సేవలో ఎస్‌బిఐ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150మందికి పైగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న దృశ్యం

కూటమి పాలనకు మోదం..భేదం..!

- ప్రభుత్వ ఉత్తర్వులు కొందరికి ఉపయోగం
- అక్రమార్కుల ఇష్టారాజ్యం
- ఏడాది పాలన తీరు తెన్ను

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై కొందరు ఆమోదిస్తుండగా, కొందరు విభేదిస్తున్నారు..రాష్ట్ర ప్రభుత్వ ప్రజల కోసం తీసుకున్న కొన్ని నిర్ణయాలకు కొందరికి బాగా ఉపయోగపడుతున్నాయి. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది కాలంలో కొన్ని మంచి పనులతో పాటు, అడ్డదిడ్డమైన అవినీతి, అక్రమాలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చిపెట్టాయి. సూపర్‌సిక్స్ హామీలు ఒక్కొక్కటి ప్రభుత్వం పూర్తి చేస్తున్నా ప్రజల్లో కొంత అసంతృప్తి కనిపిస్తోంది. ఇది ఎక్కువ మంది ప్రజలకు నష్టం చేకూర్చుతోంది...

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

విఆర్ హైస్కూల్‌ను ఆధునీకరిస్తున్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. భవన నిర్మాణ కార్మికులు, యజమానులకు ఉపయోపడేలా ఉచిత ఇసుక పాలసీ తీసుకొచ్చింది. గత ప్రభుత్వంలో బంగారంలా మెరిసిన ఇసుక, ఇప్పుడు ప్రజలకు ఉచితంగా అందుతోంది. ఎందరో ప్రజలు ఈ నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో అధికారపార్టీని అడ్డంపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలి పోతోంది. చెన్నయ్, బెంగుళూరు ప్రాంతాల్లో నెల్లూరు ఇసుకకు మంచి గిరాకీ ఉండడంతో నాయకులు ఇసుక అక్రమ రవాణాకు తెరలేశారు. ఇప్పుడు ఇంకా కొనసాగుతుంది. ప్రభుత్వం ఆదాయం వదులుకొని ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని భావించి చేసిన ఈ పనిని కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలున్నాయి. సైదాపురం మైనింగ్ విషయంలోనూ టిడిపి ప్రభుత్వం చెడ్డపేరు కూడగట్టుకుంది. గత ప్రభుత్వం కన్నా దారుణంగా మారింది. వైసిపి ప్రభుత్వం అడ్డదారిలో పెద్ద ఎత్తున దోపిడీ చేసింది. దీనికి భిన్నంగా చేస్తామని చెప్పినా కొందరు నాయకుల స్వార్థంతో టిడిపికి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఇప్పటికీ జిల్లా వ్యాపితంగా మైనింగ్ సమస్య కొనసాగుతోంది. ఇప్పటికీ లీజుదారులకు అనుమతులు ఇవ్వలేదు చిల్లకూరు సిలీకా విషయంలోనూ అధికారపార్టీనేతల జోక్యం నడుస్తోంది. అవకాశం ఉన్నంతవరకు దోపిడీ చేస్తున్నారు. గ్రావెల్ దందా కొనసాగుతోంది. ఉదయగిరి ప్రాంతంలో అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్‌ను అధికారపార్టీ నేతలు మాయం చేశారు. మద్యం పాలసీ విషయంలోనూ కొంత మార్పు కనిపిస్తున్నా ఇక్కడ అదికారపార్టీ నేతల దందానే కొనసాగుతోంది. తమకు అనుకూలమైన వ్యక్తులకే షాపులు దక్కించుకోవడం, ధరల నిరంతరణ లేదు. ఇలా ప్రభుత్వ విధానాలు ప్రజల కన్నా ఆపార్టీ నేతలకే ఎక్కువ ఉపయోగంగా ఉన్నాయి.

పేద ప్రజలకు ప్రయోజనం..అభివృద్ధి జోరు!
రాష్ట్ర ప్రభుత్వ కొన్ని నిర్ణయాలు ప్రజలకు ఉపయోగంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో మూసేసిన అన్నక్యాంటీన్లు జిల్లా వ్యాపితంగా ప్రారంభించారు. పేదలు ఐదు రూపాయలకే భోజనం చేస్తున్నారు. నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నెల్లూరురూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రోడ్లు, డ్రెయిన్లు భారీ మొత్తంలో ఖర్చు చేసి పూర్తి చేశారు. నెల్లూరు రూరల్‌లో విద్యుత్ సమస్యపైనా దృష్టి పెట్టారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు సొంత నిధులతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. ఇది ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టింది. వెయ్యి మందికి ట్రై సైకిళ్లు, వాటర్‌ప్లాంట్స్, చదువుకు ప్రోత్సహాలు, ఇలా అనేక కార్యక్రమాల నిర్వహణ ద్వార ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. నెల్లూరు నగరంలో మంత్రి పి నారాయణ పార్కులు, విఆర్ స్కూల్ ను ఆధునీకీకరించారు. సిఎస్‌ఆర్ ఫండ్స్ తీసుకొని పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నియోజకవర్గంలో గతం కంటే భిన్నంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏడాది నుంచి మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులు ఏదో కార్యక్రమం పేరుతో జనంలో ఉంటున్నారు. ఏడాది పాలనకు కొంత మోదం.. కొంత భేదం కనిపిస్తోంది. ప్రభుత్వంలో ఉన్న లోటుపాట్లు సవరించుకోవాల్సి ఉంది.

నేడు 7 గ్రామాలలో విద్యుత్ కట్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
మండలంలోని ఏడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ బొణిగి సుకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలిలా వున్నాయి.
33 కెవి ఫీడర్ కింద ఈ నెల 14వ తేదీన విద్యుత్ మరమ్మతుల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని తోటపల్లిగూడూరు, ఈదూరు, వరకవిపూడి, అనంతపురం, సాలిపేట, పేడూ రు, పాపిరెడ్డిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండ దన్నారు. ఈ మేరకు వినియోగదారులు తమ శాఖకు స హకరించాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కందుకూరు
ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14వ తేదీ శనివారం కందుకూరు డివిజన్ పోలీస్ వారి ఆధ్వర్యంలో కందుకూరు లో రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నామని డిఎస్‌పి బాల సుబ్రమణ్యం తెలిపారు. ప్రతేడాది తమ సామాజిక బాధ్యత లో భాగంగా ప్రపంచ రక్త దాతల దినోత్సవం , పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమంది రోగులకు రక్త సహాయం చేస్తున్నారు. గుండె సంబంధిత సర్జరీ లాంటి వ్యాధులకు ఇక్కడి కానిస్టేబుల్స్ తమ సొంత ఖర్చులతో వెళ్లి ఆ రోగులకు ప్రాణదానం చేయడం అందరికీ తెలుసు. ఈ సంవత్సరం కూడా ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న రక్త దాన శిబిరం లో రక్త దానం చేసి తలసేమియా, గర్భిణులు, రోడ్డు ప్రమాద బాధితులు, వివిధ రకాల ఆపరేషన్ లలో రక్తం అవసరమైన వారికి రక్త దానం చేయడానికి యువత ముందుకు రావాలని కందుకూరు డివిజన్ డిఎస్‌పి బాల సుబ్రహ్మణం పిలుపునిచ్చారు. ఈ రక్త దాన శిబిరం కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ శనివారం ఉదయం 9:30 కి రక్త దాన శిబిరం ప్రారంభమవుతున్నట్లు తెలిపారు

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు
కందుకూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసులో బ్యాంక్ 70వ వార్షికోత్సవ సందర్భంగా స్టేట్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సహకారంతో బ్లడ్ డొనేషన్ క్యాంపు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎస్‌ఆర్ యాక్టివిటీ కింద మూడు సైకిళ్లను గవర్నమెంట్ స్కూల్ లో చదువుతున్న బాలికలకు బహూకరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ అప్పలరాజు , మేనేజ్ హెచ్ ఆర్. శ్రీనివాస్ నాయక్, రీజనల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు

ఇళ్ల వద్దకే 'రేషన్' సరఫరా చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు :రేషన్ సరుకులను గతంలో లాగానే మొబైల్ ద్వారా ఇళ్ల వద్దకే సరఫరా చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు జిల్లా పౌర సరఫరాల శాఖ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా కమిటీల నాయకులు ఆధ్వర్యంలో రేషన్ సరుకులను గతంలో లాగానే మొబైల్ ద్వారా ఇళ్ల వద్దకే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దే శించి ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య మాట్లాడుతూ ప్రస్తుతం రేషన్ షాపులు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, మహిళలు అక్కడికి వెళ్లి బియ్యం మోసుకు రావాలంటే ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక కుటుంబం లో నలుగురో ,ఐదుగురు ఉంటే 20. 25 కేజీల బియ్యం మహిళలు మోసుకు రావడానికి ఎంతో కష్టమన్నారు. పురుషులు రోజువారి కూలి చేసుకుంటే కుటుంబం గడవని పరిస్థితుల్లో మహిళలే వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. ఉదయం 8 గంటలకే వెళ్లి రేషన్ షాప్ వద్ద పడిగాపులు కాయల్సి వస్తుందని, 10 గంటల తర్వాత సర్వర్ పని చేయడం లేదని, ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల కోసం మళ్లీ సాయంత్రం వెళ్లాల్సి వేస్తుందన్నారు. రెండు మూడు రోజులు కూలి పనులు మానుకొని రేషన్ షాపుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.గతంలో లాగానే రేషన్ సరుకులు మొబైల్ వాహనం లో సరుకులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వికలాంగులకు. వృద్ధులకు. ఆరోగ్యం బాగా లేని వారికి, రేషన్ సరుకులను ఇళ్ల వద్దకే తెచ్చి ఇస్తామని ప్రభుత్వం వైపు నుండి ప్రకటనలు అయితే చేశారు కానీ ఇప్పటివరకు ఏ ఒక్క వికలాంగుడికీ కానీ. వృద్ధులకు కానీ సరుకులు ఇంటికి తెచ్చి ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. రేషన్ షాప్ డీలర్ వచ్చి తంబ్ వేయించుకొని వెళుతున్నారని కుటుంబ సభ్యులే వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా ఈరోజు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని రేషన్ సరుకుల ద్వారా 16 రకాలైన నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని. ప్రభుత్వం ఏదైతే నగదు బదిలీ పథకాన్ని తీసుకొచ్చి ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలను కుంటుందో దానిని వెనక్కి తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు టి శివకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు కె పద్మ, ఎన్.వి. సుబ్బమ్మ, రూరల్ కార్యదర్శి షేక్ షాహినా బేగం, ఐద్వా సీనియర్ నాయకులు అరిగెల రామమ్మ, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎం. సంపూర్ణమ్మ. షేక్ శంషాద్ బేగం. ఐద్వా సిటీ. రూరల్ నాయకులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న ఐద్వా, వ్యకాస నాయకులు

నేడే రమాదేవి సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్
సిపిఎం సీనియర్ నాయకులు, రిటైర్డ్ విఆర్ఒ నూతలపాటి వెంకటేశ్వర్లు సతీమణి రమాదేవి సంస్మరణ సభ శనివారం తన స్వగ్రామమైన చేవూరులో జరుగుతుందని, సిపిఎం మండల కన్వీనర్ జి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు, గ్రామంలో జరిగే సంస్కరణ సభలో, సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని మృతురాలి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరుప్రతినిధి :విలువలతో కూడిన విద్యను అందించడమే విపిఆర్ విద్య పాఠశాల లక్ష్యమని, ఆ లక్ష్య సాధనకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కృషి చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడు లోని విపిఆర్ విద్య పాఠశాలలో శుక్రవారం స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ ఏడాది నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులతో పాటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే, ఫౌండేషన్ చైర్ పర్సన్ శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను నిరుపేద పిల్లలకు అందించేందుకు 2016లో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ విద్య పాఠశాలను ప్రారంభించారన్నారు. స్థాపించిన నాటి నుంచి నేటి వరకు పేద పిల్లలకు మంచి విద్యను అందిస్తూ పాఠశాల ముందుకు సాగుతుందన్నారు. ఇందుకు కారణమైన ప్రిన్సిపల్ ను, అదేవిధంగా అధ్యాపక బృందాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. పేద పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడమే విపిఆర్ విద్య పాఠశాల ప్రధాన లక్ష్యమని ఆమె ఉద్ఘాటించారు. పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు వీపీఆర్ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు.

ఈ ఏడాది 587 మార్కుల సాధించిన గాయత్రి అనే విద్యార్థిని ఉన్నత చదువులకు విపిఆర్ ఫౌండేషన్ సహాయం చేస్తుందన్నారు. విద్య విలువ తెలిసిన వ్యక్తి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అని, ఆయన సేవా తత్పరతకు విపిఆర్ విద్య ఒక కొలమానమని చెప్పారు. ఇటీవల షైనింగ్ స్టార్ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గురు వికలాంగ విద్యార్థులను ఉన్నత చదువులు చదివించేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు అందజేస్తున్న ప్రశాంతిరెడ్డి

జూలై 1న ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుడ్లూరు:ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ జూలై 1వ తేదీన నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెంలో జరుగుతాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం. రాజా పిలుపు ఇచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో కె.వెంకయ్య అధ్యక్షతన గుడ్లూరు మండలం, ఎర్ర ప్రగడ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు మహాసభలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఎం రాజా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు వలన రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ల కోసం వెరిఫికేషన్ కోసం నెల్లూరు వెళ్లాలంటే ఆటో వర్కర్స్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఈ సమస్య ప్రభుత్వం అర్థం చేసుకొని కందుకూరులోనే సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు వలన కార్మికులు అనేక నష్టాలకు గురవుతున్నారన్నారు. అమరవీరుల త్యాగాలతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినానికి తూట్లు పొడిచి రాష్ట్ర ప్రభుత్వం 12 గంటలకి పెంచడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలు పెంపు జీఓను వెనక్కి తీసుకొని ప్రభుత్వం కార్మికుల హక్కులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

నూతన కమిటీ ఎన్నిక

ఎర్ర ప్రగడ ఆటో వర్కర్స్ యూనియన్ మండల కమిటీ 19 మందితో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ఆటో యూనియన్ మండల అధ్యక్షులుగా ఎండ్లూరి నెల్సన్, కార్యదర్శి కోశాధికారిగా ఎస్కే మీరామోదీన్, ఉపాధ్యక్షులు గారికి పుల్లయ్య, సిహెచ్ సైమన్, హనుమంతు, శ్యామల్, సహాయ కార్యదర్శిగా తలారి దీనయ్య, పొట్లూరు మల్లికార్జున, తిరుపాలు, సుదర్శన్, నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పులి మాల్యాద్రి, మండల గౌరవ అధ్యక్షులుగా కే వెంకయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గడ్డం రాజేష్, మాల్యాద్రి, షరీఫ్, కొత్తపేట శీను, రవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-గుడ్లూరు :అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో గుడ్లూరు ఎంపీడీఓ, రెవెన్యూ కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అంగన్వాడి సమస్యలపై వినతి పత్రం అధికారులకు అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం దాటిపోయిన అంగన్వాడి సమస్యలు పరిష్కారం కాలేదని సిఐటియు జిల్లా నాయకులు జి. వెంకటేశ్వర్లు విమర్శించారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని 22లో వచ్చిన జీఓ అమలు కాలేదని అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. తల్లికి వందనం, ఒంటరి మహిళ, వితంతు పెన్షన్, ఎస్‌సి, ఎస్‌టిలకుఉచిత విద్యుత్తు, ఉచిత వంట గ్యాస్, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. సాధికార సర్వే పేరుతో గత ప్రభుత్వం అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా నెలకు రూ.12000 జీతం నమోదు చేశారని దీని వలన ప్రభుత్వ పథకాలు అమలవ్వడం లేదని తప్పుగా నమోదైన యాప్‌ను రద్దుచేసి అంగన్వాడీలకి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె పద్మజ, కె వెంకయ్య, సెక్టార్ లీడరు అమర గీత, కొమరగిరి సునీత, చేవూరు వరలక్ష్మి, ఆలూరు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- వలేటివారిపాలెం: మాల కొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం 1,14,73,106 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మాలకొండ పైన ఉన్న దేవస్థానం కళ్యాణ మండపంలో 11 శనివారానికి సంబంధించిన హుండీలు లెక్కించినట్లు తెలిపారు. హుండీల ద్వారా 1,14,73,106 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా బంగారం 308 గ్రాములు, వెండి 2, కేజీల415 గ్రాములు, పారిన్ కరెన్సీ. యూఎస్ఏ డాలర్లు251, సింగపూర్ 80, మలేషియా 2, ఇంగ్లాండ్ పౌండ్స్ -20, వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారిగా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా విజయ్‌కుమార్

ప్రజాశక్తి-ఉలవపాడు:మండలంలోని నూతన మండల వ్యవసాయ అధికారిగా డి. విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు సేకరించినట్లు తెలిపారు. గతంలో ప్రకాశం జిల్లా కొండేపి మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపడుతూ సాధారణ బదిలీపై ఉలవపాడు మండలంకు రావడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ శాఖ నందు అన్నదాత సుఖీభవ పథకం కు సంబంధించి రైతులకు కెవైసి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు "ప్రీ ఇంటర్నేషనల్ యోగా డే."

ప్రజాశక్తి -నెల్లూరు ::జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగాంధ్ర కార్యక్రమానికి ముందస్తుగా ప్రీ ఇంటర్నేషనల్ యోగా డే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా 14వ తేదీన(శనివారం) ఉదయం 7 గంటలకు జరుగుతుందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులు ఎంపీడీఓలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుర్తించబడిన అన్ని ప్రదేశాలలో ప్రీ ఇంటర్నేషనల్ డే మాస్ యోగ డెమోన్‌స్ట్రేషన్ నిర్వహించాలని అన్నారు. అనంతరం ఫోటోలు అప్లోడ్ చేసి డేటా ఎంట్రీ చేయాలన్నారు. జిల్లాలో ప్రతి గ్రామ వార్డు సచివాలయంలో రిజిస్టర్ చేయబడిన ప్రతి ప్రదేశంలో యోగ జరగాలని , యోగ నిర్వహణపై ర్యాంకింగ్ ఇవ్వబడతాయని తెలిపారు.యోగా కార్యక్రమం నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శనివారం జరిగే యోగా కోసం ప్రతి మండలానికి 25 వేల రూపాయలు కేటాయించారు..

మట్టి మాఫియాపై చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
మట్టి మాఫియాపై చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ ఆర్. వెంకటేశ్వరులు స్పష్టం చేశారు. మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన పోలంరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్థానిక తెలుగు తమ్ముళ్ల అండతో అక్రమ మట్టి తరలింపునకు పాల్పడ్డారు. స మాచారం అందుకున్న మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, సర్వే సూపర్ వైజర్ ఎం. సుధాకర్ లు శుక్ర వారం సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భం గా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోడూరు గ్రామంలో జరిగిన మట్టి అక్రమ రవాణా సమాచారం తమ దృష్టికి వచ్చింద న్నారు. దాంతో ప్రత్యేక తనిఖీ చేపట్టడం జరిగిం దని చెప్పారు. మట్టి అక్రమాలపై సమగ్ర ద ర్యా ప్తు ద్వారా, మట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. మట్టి దందాపై త్వరలో నిర్ణయాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పాటల పోటీలకు వర్ల గోవిందమ్మ ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం , ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సారథ్యంలో విశాఖపట్నం నగరంలో జూన్ 21న జరగనున్న "యోగాంధ్ర" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నారు. కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా స్థాయిలో ఈనెల 13(శుక్రవారం) నెల్లూరు నగరంలో జరిగిన పాటల (సంగీతం) పోటీలలో కందుకూరు మండలం, పందలపాడు గ్రామ సచివాలయం నుంచి పాల్గొన్న వర్ల గోవిందమ్మ నెల్లూరు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకొని , త్వరలో విజయవాడ నగరంలో రాష్ట్ర స్థాయిలో జరుగనున్న పాటల పోటీలకు ఎంపికైన సందర్భంగా గ్రామ సచివాలయం సిబ్బంది , బంధువులు , స్నేహితులు, గ్రామ ప్రజలు అభినందించారు.


కేక్ కట్ చేస్తున్న జనిగర్ల నాగరాజు

ఘనంగా 'జనిగర్ల' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు
కందుకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సూచనలతో గుడ్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు పుట్టినరోజు వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన కేకు నాగరాజు తో కట్ చేయించి పార్టీ నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ల రవిచంద్ర, పొదపాటి మహేష్, మేకల మాల్యాద్రి, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-నెల్లూరు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని, పారిశుధ్యకార్మి కులకు వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13వేల మంది నీటి సరఫరా, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలలో దశాబ్దాల తరబడి పనిచేస్తున్నారు. నైపుణ్యానికి తగిన జీతాలు చెల్లించడం లేదు. కేవలం నెలకు రూ.15 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, కరెంటు ఛార్జీల భారాలతో కుటుంబాలు గడవక అప్పులు పాలవుతున్నారు. ఆప్కాసులో ఉండే మున్సిపల్ కార్మికులకు ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా, 60 సంవత్స రాలకే ఇళ్లకు పంపిస్తున్నారు. వయోపరి మితి 62 సంవత్సరాలకు పెంచి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదు. తమరు మున్సిపల్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండా ప్రసాద్, ఎన్. మాలకొండయ్య, బాలు, సుజాతమ్మ, వజ్రమ్మ, భారతి, ఆనంద్, నాగరాజు, సింహాచలం, రబ్బాని, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కోటంరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించాలి

ప్రజాశక్తి -ఉలవపాడు:మండలంలోని కరేడు పంచాయతీ కరేడు సెక్టార్ పరిధి లోని ఒకటి, రెండు, మూడు, అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం కరేడు సూపర్‌వైజర్ ఎం. నాగలక్ష్మి ఆధ్వర్యంలో సామాజిక- అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కరేడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, రెడ్డయ్య, వెంకట్ పాల్గొని మాట్లాడారు. 3సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను అంగన్వాడి కేంద్రానికి వచ్చేలా ప్రతి ఒక్క తల్లి ప్రోత్సహించాలన్నారు.కార్యక్రమంలో వసంత, మహిత, మనిషా, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పీ.హెచ్.ఎం.సి సీతారాములు పాల్గొన్నారు.

ఎడిగా డాక్టర్ చెన్నకేశవులు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం:ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జరిపిన బదిలీలలో భాగంగా నెల్లూరు జిల్లా వలేటివారి పాలెం ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ చెన్నకేశవులు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వైద్యశాల నుండి బదిలీ పై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్. బ్రహ్మయ్య అద్దంకి పశువైద్యాశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్. చెన్న కేశవులు మాట్లాడుతూ 'తాను లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాలకు గతంలో డాక్టర్‌గా పనిచేశానన్నారు. ఇప్పుడు ఈ రెండు మండలాలకు కలిపి ఎడిగా రావడం సంతోషంగా ఉందన్నారు. పశువైద్య సేవలు సిబ్బంది ద్వారా వారికీ చేరువచేస్తానని తెలిపారు. గోకులం షెడ్డులు, పశుగ్రాసాల సాగు, పశువులకు అంటువ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు చేయించి, పశుపోషకులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు.

కార్పొరేషన్ ఉద్యోగులకు చెస్ పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు కార్పొరేషన్
నెల్లూరు నగరపాలక సంస్థ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఈనాడు, ఈటివి సౌజన్యంతో ఛాంపియన్స్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమిషనర్ వై.ఓ నందన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులకు మానసికోల్లాసం కోసం ఏర్పాటుచేసిన చెస్ పోటీలో ఎక్కువ సంఖ్యలో ఉద్యోగులు ఆసక్తి చూపి, పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలకు తోడు క్రీడా స్ఫూర్తిని పెంపొంది ంచేందుకు ఇలాంటి క్రీడా వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రశంసించారు .చెస్ కాంపిటీషన్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు, ఈనాడు మేనేజర్ దుర్గాప్రసాద్ తో కలిసి కమిషనర్ జ్ఞాపికలను అందజేశారు.

కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని బిజ్జంపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ప్రధానోపాధ్యాయులు జె.మాధవ రావు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బిజ్జంపల్లి పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారుల సూచనలతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టుటౌన్‌లో కరెంట్ తొలగింపు ప్రాంతాలు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ వెంగళరావు నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో వెంగళరావు నగర్, ఇందిరానగర్, బాలకృష్ణారెడ్డి నగర్, తుఫాన్ నగర్, జనతా పేట సౌత్, మున్సిపల్ ఫ్లాట్స్, వైకుంఠ పురం, పెంకుల ఫ్యాక్టరీ ప్రాంతాలలో రేపు శనివారం సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును 2 టౌన్ ఏఈ వసంతరావు ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ చెట్ల కొమ్మలు వైర్లపై పడిన చెట్లను కొట్టుట కోసం మరియు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం, సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కోసం, ట్రంక్ రోడ్డు పడమర వైపు ఉన్న కావేరి బారు, క్రిస్టియన్ పేట, కోపరేటివ్ కాలనీ, రైల్వే రోడ్డు, కోర్టు పరిసర ప్రాంతాలు, రాజా వారి వీధి, అప్పల అగ్రహారం, ఏరియా హాస్పిటల్ వరకు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపి వేయబడునన్నారు. కావలి ప్రజల అవసరాలను బట్టి ముందుగానే నీళ్లను, మిగతా ఇతర అవసరాలను సమకూర్చుకోవాలిందిగా కోరుతున్నామన్నారు. ముందుగానే పని అయిపోయితే ముందుగా విద్యుత్ సరఫరా ఇవ్వబడును తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

బాలలను పనిలో పెడితే చర్యలు

ప్రజాశక్తి-కోవూరు : అభం శుభం తెలియని చిన్నారులను పనిలో పెట్టుకుని వారితో వెట్టి చాకిరి చేయిస్తుంటే అటువంటి వారిపై తగు చర్యలు తప్పవని కార్మిక శాఖ సహాయ కమిషనర్ గౌస్‌బాషా అన్నారు. కార్మిక కమిషనర్ ఆదేశం ప్రకారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా బాల కార్మిక టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీలు నిర్వహించి ఓ బాల కార్మికుడిని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులో ఉన్న పిల్లలను బాల కార్మికులుగా పనిలో పెట్టుకున్న యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎక్కడైనా చిన్నారులను బడికి వెళ్లనీయకుండా బాల కార్మికులుగా మారుస్తుంటే అటువంటి వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాల కార్మిక టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, ఎన్‌జిఒలు ఉన్నారు.

వైభవంగా పల్లకి సేవ

ప్రజాశక్తి కోవూరు : కోవూరులోని గాంధీపార్కు సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షిసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథ సుబ్బరామయ్య స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కన్నులపండువగా నిర్వహించారు. రుత్విజులు కట్టస్వామి, సుబ్బయ్య స్వామి, మురళీ స్వామి, నిరంజన్ స్వామి, ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఎం.మల్లికార్జునరావు, అనురాధమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

పిజిఆర్ఎస్ పిటీషన్లపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజా విజ్ఞప్తుల దినంలో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తహశీల్దార్ సిహెచ్ సుబ్బయ్య అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ రెవెన్యూ అధికారి వారి వారి పరిధిలో పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన పెటిషన్లను నిశితంగా పరిశీలించి వాటికి తగు పరిష్కారం చూపేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా నీటి తీరువా వసూళ్లపై కూడా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారుల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహశీల్దార్ బషీర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, తదితరులు ఉన్నారు.

రక్తదాత వరప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-కావలి : ప్రపంచ రక్తదాన దాతల దినోత్సవం సందర్భంగా కావలి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ డాక్టర్ల ఆధ్వర్యంలో బిసి ఐక్యత భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాదరావును శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్ని వరప్రసాదరావు మాట్లాడుతూ దానాల్లో కెల్లా రక్తదానం చాలా గొప్పదని సంవత్సరానికి రెండుసార్లు రక్తదానం క్యాంప్ నిర్వహించి సుమారు 100 యూనిట్ల రక్తం సేకరించి ప్రభుత్వ ఆసుపత్రికి అందజేస్తామని దాని ద్వారా నిరుపేదలకు ఉపయోగపడేలా ప్రభుత్వ డాక్టర్లు ఉపయోగిస్తున్నారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. రక్తదానం గురించి బిసి ఐక్యత భవన్ ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవార్డు రావడానికి తన వెనుక ఉండి అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించిన బిసి ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉరిటి గోవిందుకు, బిసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర్ రావుకు, రైల్వే యూనియన్ నాయకులు ముక్కు మురళికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు.

మలేరియాను నివారించాలి

ప్రజాశక్తి-సీతారాంపురం : కీటక జనిత వ్యాధులు నియంత్రణలో భాగంగా శుక్రవారం జిల్లా మలేరియా అధికారిని ఈ హుస్సేనమ్మ ఆదేశాల మేరకు సీతారాంపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ గాజుల నవబాబు మలేరియా నివారణ వారం వారోత్సవాలలో భాగంగా మలేరియా అంతం మనతోనే అనే నినాదం తోటి అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించి ప్రజలకు వైద్య సిబ్బందికి ప్రతి శుక్రవారం కార్యక్రమాన్ని నిబద్ధతతో పాటించాలని ఇంటి పరిసరాలలో నీటినిల్వ లేకుండా చూసుకోవాలని రాత్రి సమయంలో నిద్ర పోయేటప్పుడు దోమతెరలు వాడాలని తగు సలహాలు చూసినలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్నారెడ్డి, ఎంపిహెచ్ఇఒ మజీద్, ఎంపిహెచ్ఎస్ రియాజ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుత్తలూరు : మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మలేరియా వ్యాధి ప్రబలకుండా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దుత్తలూరు ప్రాథమిక కేంద్రం వైద్యులు సయ్యద్ ఆయూబ్ అప్సర్ సూచించారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా దుత్తలూరులోని ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చలితో కూడిన జ్వరం వస్తే తప్పకుండా మలేరియా వ్యాధి ప్రధాన లక్షణమన్నారు. చుట్టు పక్కల ప్రదేశాలలో మురుకు నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని మురికి నిల్వ ఉండటం వల్ల ఎక్కువగా దోమలు ఉంటాయని అవి కుట్టకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అవగాహన ర్యాలీలో సూపర్వైజర్ కాజా మొహిద్దీన్ నారాయణ, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి-బిట్రగుంట : కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గంగాధర్ పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలలో శుక్రవారం పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నత విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా స్కాలర్ షిప్ ను పుస్తకాలను స్కూల్ యూనిఫారంను షూస్ ను అందజేస్తుందని తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ బాలికలకు ఎంపిసి బైపిసిలలో చదువుకునే వారికి అడ్మిషన్ జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి దుత్తలూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 719 పొగాకు బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 453 బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్థులు కొనుగోలు చేశారనివేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. 263 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్ఎస్ 11ఎన్ బి 198ఆర్ఆర్ 02సిఆర్ 52ఉన్నాయని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 03బేళ్లను వేలానికి అనుమతించలేదన్నారు. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర

స్మార్ట్‌మీటర్లను ఇళ్లకు బిగించొద్దు..

- ఆ ఆలోచనను ప్రభుత్వం మానుకోవాలని సిపిఎం హితవు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దని పోస్టర్లు అంటిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించే విధానాన్ని విరమించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో గురువారం శాంతి నగర్, కసాయి వీధి, ఆర్‌టిసి బస్టాండు ప్రాంతాలలో స్టిక్కర్లను అంటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ గతంలో పరిపాలించిన ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి జనంపై భారాలు మోపిందని, అప్పుడు తెలుగుదేశం పార్టీ కరెంటు ఛార్జీలు పెంపు స్మార్ట్ మీటర్లు పెట్టే విధానాన్ని వ్యతిరేకించిందని, తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం 9 నెలలకే సుమారు రూ.16వేల కోట్లు కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపిందని విమర్శించారు. పెరిగిన కరెంటు ఛార్జీలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారని ప్రజలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అంతేకాకుండా ఇప్పుడు 200 యూనిట్లు పైన కరెంటు కాలిన గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించి ఇంకా కరెంటు ఛార్జీలను అధికంగా గుంజాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. స్మార్ట్ మీటరు రేటు కూడా వేల రూపాయల్లో ఉంటుందని మీటరు రేటు కూడా ప్రతినెలా కరెంటు బిల్లుతో కలిపి ప్రజల నుండి వసూలు చేస్తారని కొన్ని రోజులు గడిచిన తర్వాత ప్రీపెయిడ్ కార్డు ద్వారా కరెంటు బిల్లును ముందుగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఇలా ప్రజలను ఇబ్బందులు పెట్టడం ప్రజలపై భారాలు మోపడం ఈ కూటమి ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రజలపై భారాలు మోపి, అదాని లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే పని చేస్తున్నారని ఇప్పటికైనా ముఖ్యమంత్రి ట్రూ అప్ ఛార్జీల పేరుతో పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్లు ఇళ్ళకు బిగించే విధానాన్ని మానుకోవాలని సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన కరెంట్ ఛార్జీల ధరలపై ప్రజలు పోరాటాలను కొనసాగించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వై.కృష్ణమోహన్ సీనియర్ నాయకులు పి.తిరుపాలు నాయకులు వి.బాబురావు, పి.సత్యనారాయణ, తదితరులున్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-కోవూరు

సొంతిళ్ళు లేని నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులకు సూచించారు. నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని ఆమె నివాసంలో హౌసింగ్, రెవెన్యూ అధికారులతో ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలో ఇళ్ల స్థలాలు కావాలని దాదాపు 1600మంది దరఖాస్తులు చేసుకొని ఉన్నారన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో అర్హులను గుర్తించి వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములతో పాటు గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లు గుర్తించి అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పేదలకు న్యాయం చేసే దిశగా చొరవ తీసుకోవాలని ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇళ్లపట్టాల పంపిణీ పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలను అరికట్టాలని ఆమె అధికారులకు సూచించారు. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తెచ్చి పేదల ఇళ్ల స్థలాల కోసం భూ సేకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, హౌసింగ్ డిఇ వెంకటేశ్వర్ రెడ్డి, కోవూరు నియోజకవర్గంలోని తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ పద్మజాకుమారిని శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షులు కేత వేణుగోపాల్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు గొట్టి గుండాల బుజిరెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలంలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారానికి కృషి చేయాలని తహశీల్దార్‌ను కోరారు.

ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

దర్గాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా సూఫీ సజ్జాదనషీన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహమద్ బాషా ఖాలిద్ కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఖాదరీయా ఆస్తానాలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం జాతీయ విధానం రూపొందించి, వాటి నిర్వహణకై ప్రత్యేక దర్గా బోర్డులను ఏర్పాటు చేయాలన్నదే మా ప్రధాన డిమాండ్ అన్నారు. ముఖ్యంగా దేశంలో ప్రాచుర్యం పొందిన 600 దర్గాలున్నాయని, వాటిని ప్రతిదిన లక్షలాది భక్తులు దర్శించుకుంటున్నారని దర్గాల సంక్షేమం ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. దర్గాధిపతులు సజ్జాదనషీన్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలు పరిష్కరించడం ద్వారా భక్తులకు మేలు చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దర్గాలలో హిందూ, ముస్లిం తదితర అన్ని కులమతాల భక్తులను సమానంగా పరిగణిస్తున్నామని తద్వారా మత సామరస్యం ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇంకా దర్గాలలో సాంస్కృతిక అంశాలను ఏకీకృతం చేయడం ద్వారా సామాజిక ఐక్యత పెంపొందుతుందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువతను తప్పుదోవ పట్టించే తీవ్రవాద చర్యలకు వ్యతిరేకంగా యువతను సన్మార్గంలో నడిపించడం కోసం ఎఐఎస్ఎస్‌సి కృషి చేస్తోందని అహ్మద్‌బాషా వెల్లడించారు. ఇస్లాం భారతీకరించడం ద్వారా దేశ సమైక్యతను సాధించడం, ప్రవక్త బోధించిన ప్రేమ, కరుణ, శాంతి, సామరస్య సిద్ధాంతాలను పెంపొందించడం తమ సంస్థ ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో జమీఅత్ వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు దస్తగిరి అహ్మద్, జహూర్, బాజా పాల్గొన్నారు.

ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సాధారణ బదిలీలలో భాగంగా శ్రీకాళహస్తి నుండి ఆత్మకూరు మండలానికి బదిలీ కాపాడిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.రఫీఖాన్ ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షులు కేత వేణుగోపాల్ రెడ్డి, కార్యాలయం సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సకాలంలో అమలు చేస్తామని పరిపాలన వేగవంతం చేస్తామని లక్ష్యాలను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండల కేంద్రంలోని హైస్కూల్ టాపర్లకు శ్రీ గణేష్ సేవా మిత్రమండలి లైన్స్‌క్లబ్ నేదురుమల్లి.సుబ్బారెడ్డి సహకారంతో ఒక్కొక్కరికి నెహల్ పార్వత్, నవ్య కుమారి, మహేష్‌లకు రూ.10వేల చొప్పున వారికి పారితోషక బహుమానం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు గాలి. శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు వారు ఇంటర్లో కూడా మరింత మార్కులతో మంచి పేర్లు ప్రఖ్యాతికించాలని ఈ విధంగా ప్రతి సంవత్సరం కూడాగణేష్ సేవా మిత్ర మండలి ఆధ్వర్యంలో వారికి పారితోషిక బహుమతులతో పాటు లాంగ్ నోట్ పుస్తకాలను పెన్నులు మెమెంటోస్ మొక్కలను అందజేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్లు, అధ్యాపకులు, ప్రముఖ రక్తదాన చైతన్య కర్త సుబ్బారావు, లైన్స్ క్లబ్ సభ్యులు సుబ్బారెడ్డి, వినయ్, శ్రీధర్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని నిలువరించాలి

మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-కావలి

ప్రయివేట్ విద్యా సంస్థల్లో ఫీజులు దోపిడీని నిలువరించి, తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులు తక్షణమే ప్రయివేట్ విద్యా సంస్థలు జరుగుతున్న దోపిడీపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూల్ ఫీజు కాకుండానే బుక్స్ పేరుతో, యూనిఫారం పేరుతో, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పండగలకు, స్కూల్ ఫేర్వెల్ ఫంక్షన్లకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నిర్ణయానికి స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు, స్థానిక విద్యాశాఖ అధికారులతో గవర్నింగ్ బాడీ నియమించి ఫీజులను నిర్ణయించాలని, ఆ ఫీజులను స్కూలు నోటీసు బోర్డులో డిస్ ప్లే చేయాలని ఉన్నప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కనీసం స్కూల్ రీఓపెనింగ్ అప్పుడు విద్యాశాఖ అధికారులు కనీసం ప్రయివేటు విద్యా సంస్థలను పర్యవేక్షించడం కానీ, ఎంత ఫీజులు వసూలు చేస్తున్నారని కానీ, బుక్స్ యూనిఫారం పేరుతో అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని కానీ పరిశీలించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. బుక్స్‌పేరుతో యూనిఫారం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బులు వసూలు చేయకూడదని చట్టం ఉన్న ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థలు టెక్నో, ఈ టెక్నో, ఐఐటి, ఇంటర్నేషనల్ సిబిఎస్ఇ, ఒలింపియాడ్, తదితర పేర్లతో తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక మొత్తంలో ఫీజులు దండుకుంటున్నారని తెలిపారు. స్కూల్ పేరు ముందు ఎటువంటి పేర్లు యాడ్ చేయకూడదని చట్టం ఉన్నా కూడా ప్రయివేట్ విద్యాసంస్థలు వాటినే ధిక్కరించి రకరకాల పేర్లతోటి తల్లిదండ్రులను మోసం చేస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసి వారిపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు. విలేకరులకు, సామాజిక కార్యకర్తలకు, సామాజిక సేవా కార్యకర్తలకు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలకు, ఫీజు రాయితీ ఇవ్వమని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అవి కూడా ఎక్కడా అమలు అవుతున్న పరిస్థితి లేదన్నారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో ఎక్కడ విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదని అన్నారు. 25శాతం ఉచిత సీట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు విద్యా సంస్థలుగా నడుస్తున్న స్కూల్స్ ప్రభుత్వ జిఒలను చట్టాలను అమలు చేయడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల ముడుపులకు తలొగ్గి నటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజులతో దోపిడిని అరికట్టాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి.డి.ఎస్.యు. మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరవది భాస్కర్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆమంచి సుబ్బు, కే మహేంద్ర పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

అనంతసాగరంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

సీతారామపురంలో...

ప్రజాశక్తి-అనంతసాగరం

అంగన్‌వాడీ, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని తహశీల్దార్ జయప్రకాష్‌కు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ భాషా మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు గౌరవ వేతనం ఇస్తూ పార్ట్ టైం ఉద్యోగులుగా ప్రభుత్వం చూస్తుందని వాళ్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగులుగా చూస్తున్నారని, స్కీమ్ వర్కర్లు జీతాలతో కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. 2022 సంవత్సరంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం జిఒ ఇచ్చిందని ఆ జీవో అమలు చేసి అంగన్‌వాడీ వర్కర్లకు, స్కీమ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నాగమణి, సునీత, జ్యోతి, పెంచలనరసమ్మ, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : గ్రామంలో అంగన్‌వాడీ స్కూల్లో వర్కర్స్‌గా, టీచర్స్‌గా పనిచేస్తున్న చాలామంది పేదవారిగా ఉన్నారని, వారి డిమాండ్లను పరిష్కరించాలని తహశీల్దార్ పివి కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ జీతంతో సంవత్సరాల తరబడి ఈ చిన్న ఉద్యోగం చేస్తూ జీవితం గడుపుతున్నామన్నారు. ఇప్పుడు పరిస్థితిని బట్టి చూస్తే వచ్చే జీతం కనీస అవసరాలు కూడా రాదని చెప్పుకోవచ్చారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు గానీ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందే అవకాశాలు లేవని తెలిపారు. వారు ప్రభుత్వ ఉద్యోగులు అని వారికి ముద్ర వేసినట్లయితే కనీసం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే సచివాలయంలో వారు ప్రభుత్వ ఉద్యోగస్తులుగా వారికి రికార్డ్ అని కన్పిస్తూ ఉందని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తల పైన వర్కర్ల పైన హెల్పర్ల పైన దృష్టి సారించి వారికి ప్రభుత్వం అమలుపరిచే తల్లికి వందనం ప్రభుత్వం అమలు పరిచే పథకాలు అన్నిటిని కూడా వారికి అందేలా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నామన్నారు. అలాగే రిటైర్డ్ అయిన తర్వాత వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం వేడుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం ఉదయగిరి ఏరియా ఇన్‌ఛార్జి కోడె రమణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న సహాయ సంచాలకులు అనిత

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన గ్రామ వ్యవసాయ సహాయకులు తమకు కేటాయించిన విధులు, బాధ్యతలపై నిర్లక్ష్యం వహించకుండా సక్రమంగా నిర్వహించాలని సహాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయాధికారులు గ్రామ వ్యవసాయ సహాయలకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు సంబంధించి ఈకెవైసి అనేది ప్రధనమైన అంశమని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల ఖాతాలో నిధులు జమ కావాలంటే సంబంధిత రైతులు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకుని ఉండాలన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని రైతులకు అవగాహన కల్పించి యుద్ధప్రాతిపదికన ఈకెవైసి కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేసేలా గ్రామ వ్యవసాయ సహాయకులు తగు చొరవ తీసుకోవాలన్నారు. కేవలం ఈకెవైసి చేయించని కారణంగా తమకు అన్నదాత సుఖీభవ నిధులు జమ కాలేదని రైతులు చెప్పకూడదన్నారు. గతంలో కూడా ఈకెవైసి సక్రమంగా చేయని కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. పండించిన వంట విషయంలో రైస్ మిల్లుకు తరలించే విషయంలో సక్రమంగా ఈకేవైసీ చేయని కారణంగా రైతులు ఇచ్చింది వద్ద సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. అటువంటి విషయాలు మరలా పునరావతం కాకుండా ప్రతి గ్రామ వ్యవసాయ సహాయకులు వారి వారి పరిధిలో యుద్ధప్రాతిపదికన ఈకెవైసి కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఇకనైనా నిర్లక్ష్యం విడనాడి భాధ్యతగా వారికి ఇచ్చిన విధులను నిర్వ హించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయాధికారులు, ఎఇఒలు ఉన్నారు.

వ్యవసాయాధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సంగం

సంగం వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల వ్యవ సాయాధికారిగా శశిధర్ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న వ్యవసాయాధికారి శ్రీహరి బుచ్చిరెడ్డిపాలెంకు బదిలీ అవగా.. చేజర్లలో పనిచేస్తున్న శశిధర్ సంగంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు రైతుసేవా కేంద్రాలలో ఈకెవైసి చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ మనోహర్ పాల్గొన్నారు.

కలిగిరి వ్యవసాయాధికారిగా జహీర్



ప్రజాశక్తి-కలిగిరి

కలిగిరి మండల వ్యవసాయ అధికారిగా షేక్ జహీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని విఎఎలు, విహెచ్ఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఈకేవైసీ త్వరిత్వరన పూర్తి చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. మనుబోలు మండలం నుంచి బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎఒ సురేష్‌బాబు, ఎఎస్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఎఇఒలు చిరంజీవి, సునీల్, తదితరులున్నారు.

ఇంటికి చేరని సరుకులు

- ఆపసోపాలు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు

సరుకులు అందని వైకుంఠపురం వృద్ధులు

ప్రజాశక్తి-అల్లూరు

65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు వికలాంగులకు, దివ్యాంగులకు రేషన్ సరుకులను డీలర్లే ఇంటి వద్దకు వచ్చి అందిస్తారని ప్రభుత్వం చెబుతున్నా.. మరోపక్క రేషన్ డీలర్లు ఆచరించడం లేదని అల్లూరు పదో వార్డుకు చెందిన దాదాపు 9 మంది వృద్ధులు వాపోయారు. వారు 9వ తేదీ వరకు రేషన్ డీలర్లు సరుకులు అందిచక పోవడంతో వారు రేషన్ షాపునకు వెళ్లి డీలర్లును అడగగా ఒకరు ఇద్దరు వుంటే సరుకులు ఇంటికి పంపించలేమని రేషన్ షాప్‌నకు వచ్చి సరుకులు పొందాలని డీలర్ చెప్పడంతో వైకుంఠపురంలో ఉన్న వృద్ధులు రేషన్ షాపుకు వెళ్లి కోసం లైన్‌లో నిలబడి నానా ఇబ్బంది పడ్డామని వృద్ధులు తెలియజేశారు. ఈ విషయంపై విఆర్ఒ పార్థసారథిని ఫోన్లో వివరణ కోరగా.. వారు వృద్ధులకు అందిస్తున్నారని ఎక్కడైనా పొరపాటున పేర్లు మిస్ అయితే వారి పేర్లు తెలిపితే రేషన్ డీలర్‌తో మాట్లాడి పంపిస్తామని తెలిపారు. విఆర్ఒకు ఫోన్ చేసిన పది నిమిషాల్లో రేషన్ డీలర్ వద్ద నుంచి రేషన్ సరుకు సదరు శేషారెడ్డికి ఇంటికి చేర్చారు ప్రతినెలా వృద్ధులకు ప్రభుత్వ ఆదేశానుసారం ఇంటికి చేర్చేలా చూడాలని కోరారు.

In the Court of the Principal District Judge : Nellore

I.A.No. 425 / 2025

O.S.No. 69 / 2015

Vibhuti Suresh - Petitioner / Plaintiff

Vs

1. **Pikkili Ravindra** (Died)
2. **Pikkili Anuradha**
3. **Pikkili Nishita**

- Respondents / Proposed LRs

Notice

To,
R2. Pikkili Anuradha,
W/o Late **Pikkili Ravindra,**
R3. Pikkili Nishita,
D/o Late **Pikkili Ravindra,**
R2 & R3 are Residing at Door No.4-17-31, Ramakrishna Nagar, Nawabpet, Nellore City.

పై నెంబరున పిటిషనరు / వాది తే29-07-2019దిన కోర్టు వారు O.S.No.69/2015 అను దావాను డిస్మిసల్ ఫర్ డిఫాల్ట్ క్రింది త్రోసివేసినందున సదరు దావాను రెస్టోర్ చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టులో ఆర్డర్ 9, రూల్ 9 ఆఫ్ సి.పి.సి. ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ లో మీకు నోటీసు నిమిత్తం **తే16-06-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

తెనాలి శ్రీనివాసులు, బి.ఎస్‌సి., బి.ఎల్., పిటిషనరు / వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

CHANGE OF NAME

I, MARREDDI MURALIDHARA REDDY (Old name), Residing at Flot No.405, 4th Floor, Sahithi Estates, Saraswathi Nagar, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as **MAREDDY MURALIDHAR REDDY** (New name) S/o. MAREDDY SITARAMI REDDY. I Further declare that both names are one and the same person.

CHANGE OF NAME

I, PUSHPA JAIN W/o MAHAVIR JAIN (OLD NAME), Resident of 14-1-14,2nd Floor,Vemuguntavari Street,Mandapala street,Nellore-524001, SPSR Nellore Dist,A.P. hereby declare that I have changed my name as

PUSHPA BAI MAHAVEERCHAND
W/o MAHAVEERCHAND
(New Name)
Henceforth, I will be known as
PUSHPA BAI MAHAVEERCHAND